# ఉత్తమ సేవలందించే పోలీసులకు రివార్డులు

## -సంగారెడ్డి జిల్లా ఎస్పీ రమణకుమార్

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సెప్టెంబరు మాసంలో విధి నిర్వాహణను అంకిత భావంలో నిర్వహించిన పోలీసులకు రివార్డులు అందచేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ యం రమణకుమార్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఫంక్షనల్ వర్టికల్‌పై నిర్వహించిన రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ యం రమణకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ ఫంక్షనల్ వర్టికల్ రిసెప్షన్, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్, క్రైమ్, టెక్ టీం, స్టేషన్ రైటర్ వర్టికల్ వారిగా ప్రతి నిత్యం ఉదయం మానిటర్ చేయాలని జిల్లాలోని ఆయా పోలీసు ఠాణా హౌజ్ అధికారులకు సూచనలు చేశారు. రివార్డులు, అవార్డులు అందుకునేందుకు పోటీ తత్వం ఉండాలన్నారు. ఆయా వర్టికల్లో ప్రతిభ చాటిన సిబ్బందికి రివార్డులు అందచేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు మహేష్‌గౌడ్, జలేందర్‌రెడ్డి, ఫంక్షనల్ వర్టికల్ సిబ్బంది పాల్గొన్నారు.




# వరికోత మిషన్ కిందపడి ఒకరు మృతి

**టేక్మాల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:**
వరి కోత మిషన్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన టేక్మాల్ మండల పరిధిలోని ధనూర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఇద్గి రామాగౌడ్ దగ్గర వరికోసి హడవిడిగా వెళ్లేక్రమంలో మంగలి బషయ్య(43) అనేవ్యక్తి పశువులను మేపడానికి వచ్చి ఒరంపై పడుకోగా వరికోత మిషన్ డ్రైవర్ అజాగ్రత్తగా మిషన్‌ను (హర్వెస్టర్) వెనకు తీస్తూ చూడకుండా బషయ్య అనే వ్యక్తిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జరిగిన ప్రమాదం తెలుసుకోని మిషన్ డ్రైవర్ పారిపోయే ప్రయత్నం చేశాడన్నారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. భార్య మంగలి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

### పాక్షిక సూర్యగ్రహణంతో తాత్కాలికంగా

# మల్లన్న సన్నిధికి ద్వార బంధనం


మల్లన్న ఆలయానికి ద్వార బంధనం చేస్తున్న అర్చకులు

**కొమురవెల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం మంగళవారం పాక్షిక సూర్యగ్రహణం సందర్భంగా తాత్కాలికంగా మూసివేశారు. ఉదయం 6 గంటలకు స్వామి వారికి నిత్య పూజలు చేసిన అనంతరం మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు రేణుక ఎల్లమ్మ, హనుమాన్ ఉపాలయాల ద్వార బంధనం చేశారు. పాక్షిక సూర్య గ్రహణం సందర్భంగా అలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మల్లికార్జున్ మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు స్వామి వారికి పూజల కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి ఆలయంతో పాటు ఉపాలయాలు తాత్కాలికంగా ఆలయ ద్వార బంధనం చేసినట్లు తెలిపారు. స్వామి వారికి నిర్వహించే అర్జిత సేవలు రద్దు చేసినట్లు తెలిపారు. తిరిగి సూర్యగ్రహణం పూర్తియిన తర్వాత రాత్రి 7 గంటలకు స్వామి వారి అలయంలో సంప్రోక్షణ చేసి నివేదన, మంగళహారతి నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం ఇచ్చారు.

**నాచగిరి, విద్యాధరి ఆలయాలు...**


మూసి ఉన్న నాచగిరి ముఖద్వారం

**వర్గల్, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీవిద్యాసరస్వతీ ఆలయం మంగళవారం సూర్యగ్రహణం ఉన్నందున మూసివేశారు. ఆలయాల్లో ఉదయం నిత్యపూజలు, అభిషేకాలు, మహానివేదన కార్యక్రమాలను నిర్వహించి ప్రధాన ఆలయాలతోపాటు ఉప ఆలయాలను మూసి వేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహా సంప్రోక్షణ అనంతరం 26వ తేదీన తెరిచి భక్తులకు దర్శనం ఆర్జిత సేవలు నిర్వహించడం జరుగు తుందని విద్యాధరి ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర శర్మ, నాచగిరి క్షేత్ర చైర్మన్ హరిపంతులు, కార్యనిర్వహణాధికారి కట్ట సుధాకర్‌రెడ్డి తెలిపారు.

**వనదుర్గా భవాని మాత ఆలయం...**


ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయాన్ని మూసివేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మండలంలోని ఏడుపాయల్లో స్వయంభూవుగా కొలువుదీరి నిత్యపూజలందుకుంటున్న వనదుర్గా భవానిమాత ఆలయం సూర్యగ్రహణాన్ని పురస్కరించుకుని మంగళవారం మూసి వేశారు. సింగూరు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో ఆలయం ముందు నుంచి నీరు ప్రవహిస్తుండటంతో ఆలయాన్ని ఇటీవల మూసివేసి రాజగోపురంలోని ఉత్సవ విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తు వస్తున్న విషయం పాఠకులకు విధితమే. సింగూరు నుంచి వస్తున్న నీటి ఉధృతి తగ్గడంతో మంగళవారం వేకువ జామున ప్రధాన ఆలయంలో అర్చకులు పూజా కార్యక్రమలు నిర్వహించి సూర్య గ్రహణాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని మూసివేసినట్లు ఆలయ కమిటిచైర్మన్ బాలాగౌడ్, ఇఓ సార శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం ప్రధాన ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి పూజా కార్యక్రమాలు చేసి భక్తులకు దైవదర్శనానికి అనుమతి ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు.

## అంతరించిపోతున్న కళలకు జీవం


కలియుగ పొన్న ఆట ఆడుతున్న దృశ్యం

**కొల్చారం, అక్టోబర్25 ప్రభాతవార్త:** అంతరించి పోతున్న కళలకు జీవం పోస్తున్న సర్పంచి శివ్వప్పగారి మాధవి శ్రీశైలం. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో టీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం (పంతులు) ఆధ్వర్యంలో పగలు, రాత్రి కష్టపడుతూ పాత్రధారులకు ఆట నేర్పించడం జరుగుతుంది. ప్రజలు, గ్రామ పెద్దల సహకారంతో కలియుగ పొన్న ఆటను నిర్వహించడం జరుగుతుంది. ఆటలో పాత్రధారులుగా టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఆయిలీ మల్లయ్య, టేక్మాల్ సిద్ధప్ప, ఆయిలి కృష్ణ, ఆయిలి యాదగిరి, ఆయిలి శ్రీనివాస్, దొడ్లె శ్రీశైలం, శివ్వప్పగారి రాజశేఖర్, మంగలి యాదగిరి, అశోక్, యాదగిరి, దశరథ్, శేఖర్, లింగం, కిష్టయ్య, వీరేశం, రామకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి హద్నూర్‌లో కార్తీక మాస పూజలు

**న్యాల్‌కల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని హనుమాన్ ఆలయంలో మాసం రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు డప్పూర్ సంగారెడ్డి, గౌరవ అధ్యక్షులు మాతంశెట్టి వీరమణి రాజ్ కుమార్, బాధ్యులు తిరుమల నర్సింహారెడ్డిలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26వ తారీఖు పాడ్యమి పర్వదినం రోజు నుంచి వచ్చే మాసం నవంబరు 23వ తేదీ వరకు గ్రామంలోని శ్రీరామ బంటు ఆంజనేయ స్వామి వారి ఆలయంలో రుద్రాభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాసం రోజుల పాటు ఉదయం 6గంటల నుంచి పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. మాసం రోజుల పాటు గ్రామానికి చెందిన భక్తుల కుటుంబ సభ్యులచే (రోజు ఒక కుటుంబం) పూజారి శివమూర్తిస్వామి వారు వేద మంత్రాలు వల్లిస్తూ ఆలయంలోని శివలింగానికి రుద్రాభిషేక పూజలు నిర్వహిస్తారన్నారు. గ్రామంలో నాలుగు సంవత్సరాల నుంచి ఆలయంలో కార్తీక మాసంలో భక్తులచే రుద్రాభిషేకం పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు గ్రామానికి చెందిన తిరుమల నర్సింహారెడ్డి (8897812356/9182144875)ని నేరుగా లేదాఫోన్‌లో సంప్రదించి తమ పేరును నమోదు చేసుకోవాలని కమిటి బాధ్యులు పేర్కొన్నారు.

# జీఎస్టీ ఎత్తి వేయాలని మోడీకి ఉత్తరాలు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని ప్రధాని మోడీకి లక్ష పోస్టుకార్డుల పంపడంపై టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపుతో మంత్రి హరీష్‌రావు సూచనతో జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులు కదం తొక్కారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల ఉత్తరాలు ద్వారా జీఎస్టీ ఎత్తి వేయాలని ప్రధాని మోడీకి లేఖలో నినదించారు. చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేటలో చేనేత కార్మికులు పది వేల పోస్టు కార్డులను ప్రధాని మోడీకా పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చేనేత కళాకారులు అందరి సంతకాలతో కూడిన ఈ లెటర్లను వారం రోజుల్లో పోస్టు చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట గొల్ల భామ నేత మగ్గం ప్లాంట్లులో పని చేస్తున్న కార్మికులచే సంఘం నాయకులు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా చేనేత పారిశ్రామిక సంఘం రాష్ట్ర నాయకులు బూర మల్లేశం, జిల్లా నాయకులు చిప్ప ప్రభాకర్ మాట్లాడుతూ చేనేత ఒక వ్యాపారం కాదని దేశ వారస్వత కళా సంపద అని పేర్కొన్నారు. దేశానికి వన్నె తెచ్చిన చేనేత రంగంపై చేనేత వస్త్రాలపై జీఎస్టీ వేయడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తగదన్నారు. చేనేతకు ఉపయోగించే ముడి సరుకులపై, చేనేత వస్త్రాలపై జీఎస్టీ వేయడం ద్వారా కార్మికుల పాలిట శాపంగా మారిందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి చేనేత ముడి సరుకులపై చేనేత వస్త్రాలపై ఎలాంటి పన్ను లేదన్నారు. జీఎస్టీ రద్దు చేయకుంటే బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. జిల్లా కేంద్రంలోని పలు సొసైటీలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


ప్రధాని మోడీకి రాసిన ఉత్తరాలను చూపుతున్న చేనేత కార్మికులు

**జిల్లా వ్యాప్తంగా 10 వేల పోస్టు కార్డులు**

సిద్దిపేట జిల్లాలో మంత్రి హరీష్‌రావు సూచన మేరకు 10 వేల పోస్టుకార్డులను ప్రధానమంత్రి మోడీకి ఉత్తరాలు రాయనున్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, కోహెడ, చేర్యాల, బెజ్జంకి ప్రాంతాల్లోని వివిధ సొసైటీల ద్వారా 10 వేల పోస్ట్ కార్డులు రాసి పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టారు.

**చేనేత దేశ వారసత్వ సంపద : మంత్రి**

రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో చేనేత కార్మికులు అలమటిస్తుంటే కేంద్రంలోని బిజెపి సర్కారు జీఎస్టీ వేయడం చేనేత కార్మికుల నెత్తిన భారం వేసినట్టే అని మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు చేయూతనిస్తుంటే కేంద్ర ప్రభుత్వం పన్నుల భారం వేస్తుందన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేసే వరకు వారికి అండగా ఉంటామన్నారు. రాష్ట్ర జౌళిశాఖ మంత్రి కెటిఆర్ ప్రధాన మంత్రి మోడీకి జీఎస్టీ ఎత్తి వేయాలని లేని లక్ష పోస్ట్ కార్డుల కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 10 వేల కార్డులు పంపిచడం జరుగుతుందన్నారు.


మంత్రి హరీష్‌రావుతో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి

## మంత్రిని కలిసిన పీఏసీఎస్ చైర్మన్

**శివ్వంపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును దీపావళి పర్వదినం సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో రైతులకు అందతున్న సంక్షేమ పథకాలైన రైతుబంధు, రైతుభీమా, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలపై వెంకట్రామిరెడ్డిని మంత్రి హరీష్‌రావు అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమం దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు ఆదేశించినట్లు మంత్రి చెప్పారు. రైతులు రాజులు కావాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ త్వరలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి మంత్రి హరీష్ రావును ఆహ్వానించినట్లు ఆయన విలేకరులతో తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి, పరికిబండ సర్పంచి పూల అర్జున్, నాయకులు మన్నె నర్సింలు తదితరులు ఉన్నారు.

## జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికైన పందిల్ల సర్పంచ్


అవార్డు ఎంపిక పత్రాన్ని అ ందుకుంటున్న సర్పంచ్ తోడేటి రమేష్

**హుస్నాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ బహుజన సాహిత్య అకాడమీ ఉత్తమ సర్పంచ్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అవార్డు ఎంపిక పత్రాన్ని రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పందిల్ల సర్పంచ్ తోడేటి రమేష్ తమ గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ జిల్లాలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా గ్రామంలో పరిసరాల శుభ్రత పట్ల ఎంతో శ్రద్ద తీసుకున్నారని గుర్తు చేశారు. పందిల్లలో తాగునీరు, డంపింగ్ యార్డు, వైకుంఠదామం, పల్లెప్రకృతి వనం, క్రీడా మైదానం, వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామ ంలో ఇతర జిల్లాల నుండి మొక్కలు తెప్పించి విరివిగా నాటి గ్రామాన్ని హరితవనంగా తీర్చిదిద్దారన్నారు. వారు చేసిన సేవ కార్యక్రమాలను గుర్తించి వారిని జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపిక చేశామని, వచ్చేనెల 13న ఈ అవార్డును బహుకరిస్తామన్నారు. సర్పంచ్ రమేష్‌సేవలను గుర్తించి ఆయనకు ఉత్తమ జాతీయ సర్పంచ్‌గా అవార్డుకు ఎంపిక చేసినందుకు అకాడమి రాష్ట్ర కమిటి సభ్యులు ముక్కెర సంపత్ రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

### బెస్ట్ సర్వీస్ జాతీయ అవార్డుకు ఎంపికైన కౌన్సిలర్

**హుస్నాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ బొజ్జ హరీష్ మంగళవారం బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో నిర్వహించిన జరిగిన సమావేశంలో కౌన్సిలర్ హరీష్‌కు జాతీయ అవార్డు ఎంపిక పత్రాన్ని రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరీష్ శానిటేషన్, పారిశుధ్య పనుల నిర్వహణ సేవలను గుర్తించి జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ అవార్డును నవంబరు 13న ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా బహుజన్ రైటర్స్ మూడవ కాన్ఫరెన్స్‌లో అందజేయనున్నట్లు తెలిపారు.

### జోడో యాత్ర అకామిడేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా కంఠారెడ్డి

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్25 ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ జోడో యాత్ర రాష్ట్ర ఆకమిడేషన్ కమిటీ చైర్మన్‌గా సీనియర్ నాయకులు ప్రేమ్‌సాగర్‌రావు, కన్వీనర్‌గా మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కఠారెడ్డి తిరుపతిరెడ్డిలను నియమించడం జరిగింది. ఈ నెల 23న రాష్ట్రంలోకి ప్రవేశించిన యాత్ర 3 రోజుల విరామంతో మళ్లీ 27న ఉదయం ప్రారంభం అవుతుందని అన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టిన వేళ ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాబోయే పది రోజుల్లో తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో పెద్దఎత్తున మార్పులు జరుగుతాయని అన్నారు. యువకులు పెద్దఎత్తున యాత్రలో పాల్గొనడం మంచి పరిణామమన్నారు.

## పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం ఎస్పీ రమణకుమార్

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురష్కరించుకుని జిల్లాలోని ఆయా పోలీసు ఠాణాల్లో విధులు నిర్వహిస్తూ అమలురైన పోలీసు కుటుంబాలను జిల్లా ఎస్పీ యం రమణకుమార్ పరామర్శించారు. అమరవీరులైన కానిస్టేబుల్ జంగయ్య, ఎల్లయ్య, సత్యనారాయణల కుటుంబాలను ఆయా ఠాణాల పోలీసు అధికారులు కలుసుకుని ధైరం చెప్పారు. జంగయ్య కుటుంబ సభ్యులను పటాన్‌చెరువు సిఐ వేణుగోపాల్‌రెడ్డి, సిఐ భీసన్న, ఎస్ఐ రామానాయుడు, ఎల్లయ్య, సత్యనారాయణ కుటుంబ సభ్యులను సంగారెడ్డి పట్టణ సిఐ బి రమేశ్, సురేశ్ కుటుంబాన్ని జహీరాబాద్ సిఐ భూపతి, కోహీర్ ఎస్ఐ సురేష్‌లు పరామర్శించి శాఖా పరంగా అండగా ఉంటామని హామి చేశారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు పండ్లు, జ్ఞాపికలను అందించారు.
సూర్యగ్రహాన్ని వీక్షించిన మున్సిపల్ చైర్‌పర్సన్

## ప్రధానమంత్రికి ఉత్తరాలు పంపిన చేనేత కార్మికులు

**గజ్వేల్, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** ప్రధానమంత్రి నరేంద్రమోడికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు తలకొక్కుల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు ఉత్తరాలు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి చేనేత కార్మికులను పట్టించుకోవడం లేదని, చేనేత పని పేద, వెనుకబడిన వారని, చేనేత పరిశ్రమ కళాకారులు నైపుణ్యతను, సృజనాత్మకతపై ఆధారపడి మనుగడ సాధిస్తుందని, చేనేత కళాకారులలో వ్యాపార దృక్పదం లేకుండా పనిచేస్తారన్నారు. దేశ స్వాతంత్ర సమర సంగ్రామంలో చేనేత వృత్తి ప్రాముఖ్యత తమరికి తెలిసిన విషయమే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి చేనేత ముడి సరుకులపై 5 శాతం జిఎస్‌టిని విధించి 12 శాతంకు పెంచాలనుకోవడం ప్రధాని నరేంద్రమోడికి తగదన్నారు. చేనేలపై విధించిన జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ చేనేత కార్మికులు మెరుగు జగదయ్య, ఆడెపు అంజయ్య, భూమయ్య, సుదర్శన్, మాదాసు సత్యనారాయణ, దేవసాని పోశెట్టి, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాముని మురళి, కోశాధికారి లింగం, సహాయ కార్యదర్శి గుండు లక్ష్మణ్, దేవులపల్లి రాజారాం, గాడిపల్లి శ్రీనివాస్, సబ్బని తిరుపతి, సుమో శ్రీనివాస్, సబ్బని నరేష్, ప్రేమ్‌కుమార్, వడ్డేపల్లి రాజు, రమేష్, గాడిపల్లి బలరాం, గుల్లపల్లి విష్ణు, పాశికంటి శ్రీనివాస్, గాడిపల్లి విజయ్, వడ్డేపల్లి నర్సింలు, హనుమాన్ల నాగరాజు, జక్కుల శ్రీనివాస్, గుండు శివ తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని నరేంద్రమోడికి ఉత్తరాలు పంపుతున్న చేనేత కార్మికులు, నాయకులు


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**బెజ్జంకి, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న నేటి వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్న కోసిన ధానాన్ని అరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దళారులు రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకే ధానాన్ని కొనుగోలు చేసి నట్టేట ముంచుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు బొమ్మిడి సాయికృష్ణ, బోనగిరి లింగం, బోనగిరి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## సూర్యగ్రహణాన్ని వీక్షించిన నేతలు

**హుస్నాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మంగళవారం సాయంత్రం ఏర్పడ్డ పాక్షిక సూర్యగ్రహ వీక్షణ కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు చింతకింది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, మాజీ ఎంపిపి ఆకుల వెంకన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోలార్ ఫిల్టర్ సహాయంతో గ్రహనాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రహనం సమయంలో వండిన వంటను తనకూడదని, గర్భిణి స్త్రీలు బయట తిరగకూడదని, ఒక వేల వెల్తే పుట్టబోయో పిల్లలు అంగవైకల్యంతో పుడతారని గ్రహనం అనంతరం స్నానాలు చేయాలని, గ్రహణం సమయంలో క్షుద్ర పూజలు, నరబలులు చేస్తారని అనేక మూఢ నమ్మకాలు సమాజంలో ఉన్నాయని, ఈ మూఢ నమ్మకలకు ప్రధాన కారణం నిరక్షరాస్యతతో పాటు సైన్స్ పట్ల అవగాహన లేకపోవడమన్నారు. ప్రజలు అశాస్త్రీయమైన విషయాలను నమ్మకూడదని, సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల శ్రీనివాస్, మహేశ్వర్, రాజేశం, శంకర్, ఆర్టీసీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎటిఎంలో వెయ్యి డ్రా చేస్తే 2 వేల నగదు

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని కమాన్ రోడ్డులోగల బీఓఐ ఎటింలో ఓ వినియోగదారుడు రూ.వెయ్యి డ్రాచేస్తే రూ. 2 వేల నగదు వచ్చిన సంఘటన మంగళవారం జరిగింది. డ్రా చేసిన డబ్బుల కంటే ఎక్కువ డబ్బులు వచ్చిన విషయం తెలియడంతో కొంత మంది ఎటిఎం వద్దకు వెళ్లి డబ్బులు డ్రా చేయడం మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు ఎటిఎంకు వచ్చి సాంకేతిక సమస్యను సరిచేసినట్లు తెలిసింది.

### విద్యార్థిని లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక టీచర్‌ను కఠినంగా శిక్షించాలంటూ

# డిఈవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ ఆందోళన

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబర్ 25, ప్రభాతవార్త:**
సంగారెడ్డిలోని కరుణ పాఠశాల ఉపాధ్యాయుడు కృపా నెల్సన్ తొమ్మిదవ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడడానికి ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని, కీచక టీచర్‌ను కఠినంగా శిక్షించాలని కరుణ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు రమ్య డిమాండ్ చేశారు. ఈఘటనను నిరసిస్తూ మంగళవారం డివో కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి, డిఈఓ రాజేష్‌తో పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతలు వాగ్వాదానికి దిగారు. డిఈఓ స్పందించి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని, హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు రమ్య మాట్లాడుతూ ఈ ఘటన గత పదిహేను రోజులుగా జరుగుతున్న విధ్యాధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ ఘటన జరగడం దర్మార్గమని అన్నారు. రోజురోజుకు విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈ ఘటన గురించి మూడురోజులక్రితం యాజమాన్యం దృష్టిలోకి వచ్చింది. ఈ విషయం గురించి కరుణ స్కూల్ యామానన్యం ఎలాంటి స్పందన తీసుకోలేదు. ఆ విద్యార్థి పరీక్షలకు రాకపోతే వాళ్లతో మాట్లాడి ఎందుకు రాలేరు అనే విషయాన్ని తెల్సుకోవాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంకి ఉంటుందని, కానీ వాళ్లకు ఈ ఘటన గురించి తెలుసుకాబట్టి యాక్షన్ తీసుకోలేరు. గతంలో కూడా నెల్సన్ సదాశివపేటలో ఇలాంటి దారుణానికి పాల్పడినప్పుడు హెచ్చరించి వదిలేయడం జరిగింది. ఒక ఉపాధ్యాయునికి పాఠశాలలో తీసుకునే ముందు అతని గురించి పూర్తిగా తెలుసుకున్నాక పాఠశాలలోకి రానివ్వాలని, ఇది ఆ పాఠశాల నిర్లక్ష్యం అని, వెంటనే కరుణ పాఠశాల గుర్తింపుని రద్దుచేసి, ఆ చిన్నారికి న్యాయం చేయాలి. అలాగే నెల్సన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు మహేష్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు రవి, రేణు, కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సంగారెడ్డి డిఈవో కార్యాలయం ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు

# వరకట్న వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

### భర్త, అత్తలే కారణం .. కుటుంబీకులు, బంధువుల ఆరోపణ

**ములుగు, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):**
అదనపు కట్నం కోసం వేధింపులను తాళలేక ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేటజిల్లా ములుగు మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ములుగు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాయపోల్ మండలం ఎల్కంటి గ్రామానికి చెందిన స్వామి తన కూతురు కళ్యాణిని మూడు సంవత్సరాల క్రితం ములుగు మండలం అన్నసాగర్ గ్రామానికి చెందిన కుక్కల బాబుకు కట్నకానుకలు ఇచ్చి వివాహం జరిపించారు. ఒక సంవత్సరం పాటు సాఫీగా సాగిన వారి సంసారంలో అత్త బాలమణి, అత్త చెల్లెలు అరుణలు వారి కుమారుడు బాబును ఆసరాగా చేసుకొని అదనపు కట్నం కోసం కోడలు కళ్యాణిని వేధించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో తండ్రి స్వామికి కళ్యాణి విషయం తెలుపగా అప్పుచేసి రూ.50వేలు అల్లుడు బాబుకు ఇచ్చి సంసారం సాఫీగా చేసుకోమని తెలిపారు. కొద్ది రోజులు సాఫీగా జీవనం సాగించగా మళ్ళీ అదనపు కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడ్డారు. వారి వేధింపులు తాళలేక కళ్యాణి ఈనెల 20వ తేదీన పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 24వ తేదీ సోమవారం మృతిచెందింది. మృతురాలు కళ్యాణికి 15 నెలల కుమారుడు ఉన్నాడు. కాగా తమ కూతురు భర్త, అత్త, అత్త చెల్లెలు వరకట్నం కోసం వేధించడం వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని కళ్యాని తండ్రి స్వామి ఆరోపించారు. తన కూతురు మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు పోలీసులు తెలిపారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి

## పాఠశాలలను సందర్శించిన డీఈఓ

**చిన్నకోడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** మండలపరిధిలోని అల్లీపూర్ కేజీబీవీ పాఠశాలను డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తొలిమెట్టు కార్యక్రమంలో ప్రగతిని పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులతో చర్చించి తెలుసుకున్నారు. అలాగే మండల పరిధిలోని యుపిఎస్ కిష్టాపూర్ పాఠశాలను సందర్శించారు. తొలిమెట్టు అమలు తీరును విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అయన వెంట ఎఎంఓ రామస్వామి, జీసీడిఓఫ్ ఏఓ కేజీబీవీ ఎస్ఓ శారద, యుపిఎస్ హెచ్ఎం ముకుందం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించిన శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు గ్రామస్తులు



శివన్నగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ జహంగీర్

**ములుగు, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** ములుగు మండలం తునికి బొల్లారం సమీపంలో కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల కోసం నిర్మించిన ఆర్అండ్ఆర్ కాలనీని మంగళవారం నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం మర్రిగూడెం మండలంలో నిర్మిస్తున్న శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు గ్రామమైన వెంకిపాడు గ్రామస్తులు సందర్శించారు. ఈ సందర్భంగా వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరంఅధ్యక్షుడు లింగారెడ్డి, మామిడ్యాల మాజీ సర్పంచ్ సత్తయ్యాచారిలు వెంకిపాడు గ్రామస్తులకు కాలనీలోని ఇండ్లను, వసతులను చూపించారు. దీంతో వెంకిపాడు గ్రామస్తులు కాలనీలో సౌకర్యాలు చాలా బాగున్నాయని ఆనందం వ్యక్తం చేస్తూ మాకూ ఇలాంటి సౌకర్యాలతో కూడిన కాలనీని నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నాణ్యత పాటించకుంటే ఆందోళనలు నిర్వహిస్తాం

### -శివసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లిఖార్జునరెడ్డి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న నాయకులు

**హుస్నాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** పట్టణంలో జరుగుతున్న రోడ్డు పనుల్లో నాణ్యత పాటించకుంటే శివసేనా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని నియోజకవర్గ ఇంచార్జ్ అయిలేని మల్లిఖార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రోడ్ల పనులు ప్రారంభించినప్పుడు ఉన్న నాయకులు, అధికారులు అశ్రద్ధతో పనులను సైతం పరిశీలిస్తూ కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా చూడాలన్నారు.రోడ్డు పనుల్లో నాణ్యత పాటించకుంటే కొద్ది రోజుల్లోనే గుంతలుపడుతాయని కావున అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనీల్,రాంరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడలు



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న సుద్దాల అశోక్‌తేజ

**వర్గల్, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** మండలంలోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడలు సోమవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఓవరల్ చాంపియన్‌గా నిలిచిన మహబూబ్ నగర్ జిల్లా జట్టు క్రీడాకారులకు ప్రముఖ రచయిత, గాయకులు సుద్దాల అశోక్‌తేజ, ఎంజెపి బిసి గురుకుల పాఠశాలల కార్యదర్శి మల్లయ్యభట్టు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, సాహిత్య, జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయం తదితర కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు చక్కని విద్యను అందించి ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత లక్ష్యాలకు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని, విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌సిఓ ప్రభాకర్, డిప్యూటీ సెక్రటరీ తిరుపతిరెడ్డి, ఆదిత్య, ఎంజెపి ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో టిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

**వర్గల్, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** మునుగోడు ఉపఎన్నికల్లో టిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌ముదిరాజ్, రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాచగిరి ఆలయ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరిలు పేర్కొన్నారు. మునుగోడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా అక్కడి ప్రజలు టిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీ అందిస్తామని చెప్పున్నట్లు వారు పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. సిఎం కెసిఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాచగిరి ఆలయ డైరెక్టర్ పడిగె రాజు, వర్గల్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీరాం నర్సింలు, ములుగు మండల ముదిరాజ్ అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, పల్లె బాబు, జోగిని రవి, తోడేటి బలవంత్, శ్రీరాంపూర్ శ్రీనివాస్, రామకృష్ణ, రాజు, సుదర్శన్, బాలయ్య, శ్రీనివాస్, సురేష్, దామోదర్, నర్సింలు, కిషన్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



మునుగోడులో ప్రచారం నిర్వహిస్తున్న టిఆర్ఎస్ నేతలు

# మల్లన్న సన్నిధిలో సహస్రదీపాలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/కొమురవెల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త :**

జిల్లాలో దీపావళిపండగను సోమవారం ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఉదయం హారతులు తీసుకున్న అనంతరం లక్ష్మి పూజలు చేశారు. సాయంత్రం వేళ బాణాసంచాలు, టపాసులు పేల్చి పండగను సంబరంగా జరుపుకున్నారు. పండగ రోజు కొత్త బట్టలు ధరించారు. చిన్నా పెద్ద సంబరాలు వేడుకగా జరుపుకున్నారు. పండగ సందర్భంగా టపాసుల దుకాణాలు కిటకిటలాడాయి. టపాసులు పేల్చేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముందుగానే ప్రచారం చేశారు. దీపావళి పండుగ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలడాయి.

కాగా కొమురవెల్లిలోని ప్రముఖ శైవ క్షేత్రమైన మల్లికార్జునస్వామి ఆలయంలో దీపావళి పర్వదినం సందర్భంగా మహా మండపంలో అర్చకులు శివాకృతి, స్వస్తిక్, ఓం ఆకారంలో వెయ్యి దీపాలను పేర్చి సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అలయ చైర్మన్ గీస భిక్షపతి, ధర్మకర్త నామ్‌రెడ్డి సౌజన్యరెడ్డి,



మల్లన్న సన్నిధిలో సహస్రదీపాలను ప్రారంభిస్తున్న అలయ చైర్మన్, అర్చకులు

భక్తులు, స్థానికులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్తీకమాసం శివునికి ప్రీతికర మైందని కార్తీక మాసంలో శివాలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో మహిళలు దీపాలను వెలిగిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని అలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ తెలిపారు



మాట్లాడుతున్న బిజెపి అధ్యక్షుడు రాజు

## ఫ్లెక్సీ చించివేయడం హేయమైన చర్య

**మెదక్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన బిజెపి ఫ్లెక్సీని చించి వేయడం హేయమైన చర్య అని బిజెపి మండల అధ్యక్షుడు పోగుల రాజు అన్నారు. మంగళవారం ఆయన చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ స్థానిక బస్టాండ్ వద్ద బిజెపి పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారని, ప్రజల్లో పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ సుభాష్‌గౌడ్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సినియర్ నాయకులు మంగళియాదగిరి, వనం నర్సింలు, మండల ఉపాధ్యక్షులు స్వామి, మైనార్టీ అధ్యక్షులు సయ్యద్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు శంకర్, యువ మోర్చా జిల్లా కోశాధికారి మధు, యువ మోర్చా మండల ఉపాధ్యక్షులు బాబు, బూత్ అధ్యక్షులు పోతరాజు, ప్రవీన్ కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సహాయం

**పాపన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మెడిసిన్‌లో ర్యాంక్ సాధించిన నిరుపేద గిరిజన విద్యార్థి ప్రవీణ్‌కు ఆర్థిక సహాయం అందించేందుకు హైకోర్టు న్యాయవాది, భారతీయ జనతాపార్టీ తాళ్లపల్లి రాజశేఖర్ ముందుకు వచ్చారు. మెడిసిన్‌లో సీటు పొందిన గిరిజన విద్యార్థి చదువుకొనేందుకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు వార్తా మాధ్యమాల ద్వార తెలుసుకున్న రాజశేఖర్ విద్యార్థికి 10వేల రూపాయలను అందించాలని పార్టీ మండల అధ్యక్షులు సంతోష్‌చారికి ఫోన్ పే చేయడంతో సంతోష్‌చారి విద్యార్థి దగ్గకు వెళ్లి నగదును అందచేశారు. బాగా చదువుకోవాలని రాజశేఖర్ సూచించారని విద్యార్థికి తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆకుల సుధాకర్, నరేష్, నారాయణ, భాగేష్, నర్సింలు, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

## వైభవంగా దీపావళి వేడుకలు

**పాపన్నపేట, అక్టోబరు 25,ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం దీపావళిపండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు టపాసులు కాలుస్తూ ఆనందోత్సవంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం ఆడపడుచులు అందించిన హారతి అందుకున్నారు.సాయంత్రం వ్యాపార సముదాయాల్లో లక్ష్మీ పూజలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు.

## నేడు గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం

### -పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 25,(ప్రభాతవార్త):**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుకుల పాఠశాల ప్రారంబోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మహబూబీ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హఫీజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాల ప్రారంబోత్సవానికి రాష్ట్ర విద్యశాఖ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు మరి కొంతమంది ముఖ్య నాయకులు అధికారులు పాల్గొననున్నట్లు వా రు తెలిపారు. ఉదయం 10:30లకు పాఠశాల ప్రారంబోత్సవ కార్యక్రమం ప్రారంబమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## మునుగోడుకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 25,(ప్రభాతవార్త):**

మునుగోడు నియోజకర్గంలో ఎన్నికల ప్రచారం చేసేందుకు జిల్లెడు చౌదరిగూడ మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం బయ లుదేరి వెల్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు దు చలివేంద్రంపల్లి రాజు మాట్లాడుతూ మునుగోడు నియోజ కవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉన్న పాల్వాయి స్రవంతికి మద్దతుగ ప్రచారం చేసేందుకు పార్టీ కార్యకర్తలు వెల్తున్నట్లు తెలి పారు. కాంగ్రెస్ పార్టీ ఇదివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథ కాలే పార్టీ అభ్యర్థిని గెలిపిస్తాయని అన్నారు.



నరసింహానాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీఐ కిరణ్ తదితరులు

## అమర పోలీసులను సమాజం మరవదు : సిఐ

**అక్కన్నపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త :** విధి నిర్వహణలో అమరులైన పోలీసులను సమాజం ఎన్నటికి మరువదని హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ అన్నారు.మంగళవారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వారిని స్మరిస్తూ ఫ్లాగ్‌డే నిర్వహించారు.ఈ నేపథ్యంలో అక్కన్నపేట మండలం దుబ్బతండా గ్రామానికి చెందిన గుగులోతు నరసింహానాయక్ సిఆర్‌పిఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ 2014సంవత్సరంలో విదినిర్వహనలో ప్రాణాలు కల్పోగా తన తండ్రి కొడుకు గుర్తుగా తమ వ్యవసాయ పొలంలో నరసింహానాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు.విధినిర్వహనలో ప్రాణాలు కోల్పోయిన నరసింహానాయక్ విగ్రహాన్ని సీఐ ఎర్రల కిరణ్, అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్,కోహెడ ఎస్ఐ నరేందర్‌రెడ్డిలు సందర్శించి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం అమర పోలీస్ తల్లితండ్రులైన సత్యవతి లింగయ్యలను శాలువాతో సన్మానించి నూతన వస్త్రాలు అందజేశారు.

## మొండయ్య మృతి సిపిఐకి తీరనిలోటు

**హుస్నాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మండలంలోని మహ్మదాపూర్ గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు సంఘం మొండయ్య మంగళవారం రోజున మరణించగా విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు ఆయన అంత్య క్రియలకు హాజరై భౌతిక దేమానికి పార్టీ జుండాను కప్పి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కొమురయ్య, సంజీవరెడ్డి,ఎగ్గోజు సుదర్శనచారి,పార్టీ గ్రామ కార్యదర్శి ప్రసాద్,నాయకులు రాజయ్య,సుధాకర్,సుజిత్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి సిఎం కెసిఆర్ : కౌన్సిలర్

**గజ్వేల్, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** పేదల పక్షపాతి సిఎం కెసిఆర్ అని 12వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డుకు చెందిన కమలమ్మ గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ చొరవ చూపి రూ.2.50 లక్షల ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఎల్ఓసీ అందించారన్నారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి సైతం ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకున్న కమలమ్మకు ఎల్ఓసి ఇప్పించినట్లు పేర్కొన్నారు. కష్టకాలంలో ఆదుకున్న సిఎం కెసిఆర్‌కు, మంత్రి హరీశ్‌రావు, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లబ్దిదారులు ఎల్లవేళలా సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, వార్డు అధ్యక్షుడు ఎం.ఎ.జమీల్, అక్బర్, పాషా, నాగరాజు, మల్లేశం, బిక్షపతి, స్వామి, సంతోష్, చందు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా దీపావళి పండుగ

**కొందుర్గు, అక్టోబర్ 25,(ప్రభాతవార్త):**

భక్తి శ్రద్దలతో ఆనందోత్సవాల మద్య దీపావలి సంబురాలు మం డల ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. దీపావలి పర్వదినాన్ని పు రష్కరించుకుని పలు దేవాలయాలలో భక్తులు వెల్లి ప్రత్యేక పూ జలు చేశారు. మద్యహ్నం లక్ష్మీపూజ కోసం వస్తువులు కొనుగోలు చేసుకున్నారు. గ్రామాలకు వచ్చిన ప్రజలు పెద్ద ఎత్తున రావడం వల్లన స్వీట్లు, టపాకాయలు, పూలు, పండ్లు దుకానాల వల్ల రద్ది ఏర్పడింది. సాయంత్రం యువకులు వారి వారి ఇళ్ల ముందు బా ణసంచాలు, టపాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

## రక్షణ కోసం కరాటే ఎంతో అవసరం

అత్యవసర పరిస్థిలలో తనను తాను రక్షించుకోవడానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని న్యూ మాంగ్స్ కుంగ్ ఫూ జిల్లా అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. ఈ నెల 15న మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో జరిగిన డ్రాగన్ బుడోకాన్ వారి ఆద్వర్యంలో 15వ నేషనల్ కరా టే టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో కొందుర్గుకు చెందిన జిల్లెల్ల కార్తిక్ గోల్డ్ మెడల్ సాదించాడు.

# శిలాఫలకానికే పరిమితమైన చిన్నచింతకుంట డబుల్ రోడ్డు

**నర్సాపూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:**

టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేసి వదిలేస్తున్నారు. ఈ మేరకు చిన్నచింతకుంట గ్రామానికి 2018లో డబుల్ నిర్మాణానికి మంత్రి హరీష్‌రావు శంఖుస్థాపన చేసి శిలా ఫలకాన్ని ఏర్పాటు చేయగా 4 సంవత్సరాలైన ఇప్పటికీ పనులు ప్రారంభించ లేదని బిజెపి నాయకులు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ పేర్కొన్నారు.మంగళవారం మెదక్ ప్రధాన రోడ్డులో గల చిన్నచింతకుంట స్టేజీ నుండి గ్రామానికి డబుల్‌రోడ్డు నిర్మాణానికి 2 కోట్ల 50 లక్షలు మంజూరు కాగా 4 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఈమేరకు బిజెపి నాయకులు మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, బిజెపి నాయకులు గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్, ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాఆపగారి పెద్ద రమేష్‌గౌడ్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో శిలాఫలకానికి కొబ్బరి కాయలు కొట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మురళీయాదవ్ మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఏర్పాటు చేసి గాలికి వదిలేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు శిలాపలకానికి పరిమితం కాగా శిలాపలకాలు వెక్కిరిస్తున్నాయని ఇందకు నిదర్శనం చిన్నచింతకుంట డబుల్ రోడ్డు శిలాపలకమే

### శిలాఫలకానికి కొబ్బరికాయలు కొట్టి బిజెపి వినూత్న నిరసన



శిలాఫలకానికి కొబ్బరికాయలు కొట్టి నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

నని తెలిపారు. నర్సాపూర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పటికి పూర్తికాకపోగా మండలంలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో గంగిరెడ్డుల వారి గుడిసెలు తొలిగించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని చెప్పినా ఇప్పటికి అమలుకాలేదన్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు ఏ విధంగా గుణపాఠం చెప్పామో అదేవిదంగా మునుగోడులోనూ టిఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతామన్నారు బిజెపి నేత వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితం కాగా స్థానిక ఎమ్మెల్యే మునుగోడులో అబివృద్ధి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అయితే ఎన్నికలు వచ్చినప్పుడే టిఆర్ఎస్ ప్రభుత్వం అక్కడి గ్రామాల్లోనే అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శిలాఫలకాలకే పరిమితమైన అభివృద్ధి పనలను వెంటనే పూర్తి చేయాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టి ప్రజల్లో ప్రభుత్వం చేస్తున్న మాయా మాటలను ప్రజలకు వివరించి చైతన్య వంతలను చేసి రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు తగిన బుద్ది చెడబుతామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి భూత్ అధ్యక్షులు నగేష్, నాయకులు బాల్‌రాజ్, నాగేశ్‌గౌడ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



ఈటలను కలిసిన మురళీయాదవ్ తదితరులు

## ఈటల రాజేందర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

**నర్సాపూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను బిజెపి నాయకులు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ కలిశారు. మునుగోడులో బిజెపి అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న బిజెపి నాయకులు మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ తో పాటు బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిది పాపగారి పెద్ద రమేష్‌గౌడ్, రియాజొద్దీన్ ఆయనను కలిశారు. ఈసందర్భంగా మునుగోడులో నడుస్తున్న ప్రచారం పై ఎన్నికలు తదితర విషయాలను వారు చర్చించారు. ఈ మేరకు ఈ మునుగోడులో తప్పకుండా బిజెపి పార్టీ అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డి విజయం సాధిస్తాడన్నా ధీమాను వారు వ్యక్తం చేశారు.

## మునుగోడు ప్రచారంలో పాల్గొన్న వాల్దాస్ మల్లేష్‌గౌడ్



మాజీ ఎంపి భూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తో కలిసి ప్రచారంలో పాల్గొన్న వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్, అక్టోబర్ 25 .ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా మంగళవారం బిజెపి నాయకులు గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్దాస్ మల్లేష్‌గౌడ్ బిజెపి నాయకులు మాజీ ఎంపి భూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీవైలంగౌడ్ లతో కలిసి ప్రచారంలో పాల్గొని బిజెపి అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డి గెలుపు సాధిస్తాడన్నా ధీమాను వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోబిజెపి నాయకులు గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తో పాటు బిజెపి పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, హత్నూర మండల అధ్యక్షులు నాగప్రభుగౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ నిఖిల్‌గౌడ్, నర్సాపూర్ రూరల్ యువ మోర్చా ఉపాధ్యక్షులు నర్సింహ్మాచారి, హత్నూర మండల ప్రధాన కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కొడిపల్లిలో అంబరాన్నంటిన దీపావళి పండుగ సంబరాలు

### -సూర్యగ్రహణం వలన సోమవారమే లక్ష్మి పూజలు

**కౌడిపల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండల వ్యాప్తంగా దీపావళి సంబరాలు అంబరాని అంటుకున్నాయి. ఈ ఏడు అమావాస్యతో పాటు సంపూర్ణ సూర్య గ్రహణం రావడంతో చాల మంది సోమవారం సాయంత్రం నుండి హడ ఉడిగా తమ తమ పాపులను శుద్ధి చేసుకొని శ్రీలక్ష్మిదేవి పూజలను వేద బ్రహ్మణుల చేతుల మీదుగా జరిపించుకొని భారీఎత్తున బాణసంచను కాల్చి ఆనందోత్సవాల్లో ప్రజలు అత్యంత్య వైభవంగా దీపావళిని జరుపుకున్నారు. ఉదయం నుండియే చిన్నారులు నూతన వ స్త్రాలను ధరించి, టపాకాలను కాల్చుకుంటు, తోటి మిత్రులతో కలిసి సరదాగా గడిపినారు. నూతనంగా వివాహం చేసుకొన్న వారికి తెల్లవారు జామునే 6.30 గంటల వరకే శ్రీ లక్ష్మి దేవత హారతులను ఇచ్చి, నూతన దంపతులకు కట్నకానుకలను సమర్పించి, పండుగను ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. కాగా కౌడిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడన్నలు కుటుంబ సమేతంగా వెళ్లి కార్తీక మాసంను స్వాగతిస్తు ఆలయ ప్రాగంణంలో దీపాలను వెల్గించి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కుటుంబీకులు సామూహికంగా కలిసి ఆలయం ఎదుట పెద్ద ఎత్తున బాణ సంచి కాల్చినారు. రాత్రులందు బాణ సంచను కాల్చినప్పుడు ఆకాసంలో పెద్దగా దీపాల కాంతులు విరజింపుతు పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. మరుసటి రోజైన బుధవారం ఉదయం సంపూర్ణ సూర్యగ్రహణం మూలంగా మండలంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రాలను బ్రహ్మణులు వేద మంత్రాల మధ్య ఆలయంలో పూజలు నిర్వహించి, ఆలయాల ప్రధాన ద్వారాలను ముసి సీల్డ వేసినారు. తునికి గ్రామంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ ఆసిస్టెంట్ వెంకట్‌రెడ్డిల సమక్షంలో ఆలయ ప్రధాన ఆర్చకులు అమ్మవారికి పూజలు చేసి ఆలయ ప్రధాన ద్వారంకు తాళ్లాలు వేసి ఆలయం మూసివేశారు. వెల్మకన్నె గ్రామంలో 400 సంవత్సరాల చరిత్ర కల్గిన శ్రీ రాయగిరి వెంకటేశ్వరాలయం, శ్రీ భ్రమరాంబ మల్లి కార్జున స్వామి ఆలయం, శ్రీ శైనేశ్వరాలయం, కొడిపల్లిలోని శ్రీ అభయ సీతారామచంద్ర ఆంజనేయల ఆలయం, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం, వెంకటాపూరం (ఆర్)లో నూతనంగా నిర్మించి ప్రతిషి ంచిన శ్రీ సత్యనారాయణస్వామి ఆలయాలను వేద బ్రహ్మణుల ప్రత్యేక పూజల తర్వాత మూసివేశారు.

**కొల్చారం మండలంలో...**

**కొల్చారం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** దీపావళి పర్వ దినాన్ని పురస్కరించుకుని కొల్చారంతో పాటు మండల వ్యాప్తంగా సోమవారం అన్ని గ్రామాల్లో ప్రజలు దీపావళి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. వేకువ జామునే స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి ఆడపడుచులతో సోదరులు మంగళ హారతులు తీసుకుని ఆశీస్సులు పొందారు. దేవుళ్లకు నైవేద్యం సమర్పించి పేనీల పలహారాలు తీసుకోవడం జరిగింది. ఈ పర్వదినం సందర్భంగా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వేళల్లో పలు వ్యాపార సంస్థలు, కార్యాలయాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించుకుని అతిథులకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. అలాగే మండల కేంద్రంలోని కొల్చారంలోని శివాలయం, వీరభద్ర ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్న పెద్దలు, ఆడపడుచులు కలిసి వారి వారి ఇళ్ల ముందు టపాసులు కాలుస్తూ దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. దీపారాధన కాంతుల కార్యక్రమం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో దీపావళిని ఘనంగా జరుపుకున్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** మండలంలో సోమవారం దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే హారతుల తీసుకొని నియమ నిష్టలతో ఇంట్లో ధనలక్ష్మీ పూజలు నిర్వహించారు. కొందరు తమ ఇండ్లల్లోదొంతులు పెట్టుకొని ప్రత్యేకంగా పూజలు చేశారు. అంతేగాక ప్రతి ఇండ్లలో దీపావళీ సందర్భంగా తీపి వంటకాలను చేసుకొని బంధువుల తో కలిసి సాయంత్రం వేళల్లో టపాకాయలు, బాణా సంచాలు పేల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఇదిలావుండగా నర్సాపూర్ పట్టణంలో వ్యాపారస్తులు తమ దుకాణాల్లో సాయంత్రం వేళల్లో ధనలక్ష్మి పూజలను నియమ నిష్టలతో, భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు అనంతరం రాత్రి సమయాల్లో దుకాణాలముందు టపాకాయలు, చిచ్చుబుడ్లు, బాణాసంచలు కాల్చి ఈ దీపావళీ పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో కూడ ఈ దీపావళీ పండగను గ్రామాల ప్రజలు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈమేరకు నర్సాపూర్ పట్టణంతో పాటు మండల పరిదిలోని గ్రామాల్లో సైతం దీపావళిని అనందోత్సవాలతో జరుపుకున్నారు.

**చిన్నశంకరంపేటలో...**

**మెదక్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పట్టణ కేంద్రంలో సోమవారం నాడు ప్రజలు దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. నరకచతుర్థశి సందర్భంగా జరుపుకునే దీపావళి పండుగతో తమ ఇండ్లలో,తమ జీవితాల్లో కొత్త వెలుగులను నింపాలని కోరుకుంటూ ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకున్నారు. ఉదయాన్నే లేచి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం తమ ఇళ్లలో,వ్యాపార, వాణిజ్య సంస్థల్లో, కార్యాలయాల్లో లక్ష్మీ పూజలు చేసుకున్నారు. తరువాత చిన్నా, పెద్ద తేడా లేకుండా టపాసులు కాల్చి దీపావళిని ఘనంగా జరుపుకున్నారు.



పోస్టుకార్డులతో చేనేత సహకార సంఘం సభ్యులు

## జిఎస్టీని రద్దు చేయాలంటూ ప్రధానికి లేఖలు

**సదాశివపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** చేనేత రంగంపై వేసిన జిఎస్టీని రద్దుచేయాలని కోరుతూ సదాశివపేట చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నేతన్నలు పోస్టుకార్డు ద్వారా లేఖ రాశారు. చేనేత సహకార సంఘం అధ్యక్షులు చింత గోపాల్ మాట్లాడుతూ చేనేత వృత్తి వ్యాపారం కాదు. మన దేశ వారసత్వ కళా సంపద అన్నారు. మోడీ ప్రభుత్వం ముడిసరుకులపై, చేనేత వస్త్రాలపై ఐదు శాతం జీఎస్టీ విధించి దానిని 12శాతానికి పెంచాలని కోరడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. జిఎస్టీ వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు గడీల గణేష్, పద్మశాలి పట్టణ అధ్యక్షులు అంబటి విశ్వనాథం, డైరెక్టర్లు గోనె శంకర్, చింత ఆనంద్, చేనేత కార్మికులు రుమాండ్ల రాజు, మాణిక్‌రావు, వెంకన్న, తుకారం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎండి సజ్జనార్‌కు దీపావళి శుభాకాంక్షలు

**సదాశివపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** ఆర్టీసీ ఎండి, అడిషనల్ డిజిపి క్యాడర్ అధికారి సజ్జనార్ జన్మదినం సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆత్మకూర్ నాగేష్ సజ్జనార్‌కు పూలబుకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ సజ్జనార్‌లాంటి అధికారి రాష్ట్రంలో పని చేయడం ఎంతో గర్వకారణమని, పోలీస్ అధికారిగా ఉన్నప్పుడు నేరస్థులను గడగడ లాడించారన్నారు. ఇప్పుడు ఆర్‌టిసి ఎండిగా ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టి, ఆర్టీసీని లాభాల్లో, ప్రయాణీకులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు.

## లీకేజీలను సరిచేయండి-వృధా నీటిని అడ్డుకోండి



వృధాగాపోతున్న నీటిని పరిశీలిస్తున్న బిజెపి నేత ఆనంద కృష్ణారెడ్డి

**పటాన్‌చెరువు, అక్టోబరు 25, ప్రభాతవార్త:** తాగునీటి సరఫరాలో అధికారులు అలక్ష్యంగా వ్యవహరించకూడదని, లీకేజీలను సరి చేసి నీటి వృధాను అరికట్టాల్సిన అవసరం అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని భారతీయ జనతా పార్టీ నాయకులు, సామాజిక వేత్త కేజెఆర్ ఆనంద కృష్ణారెడ్డి అన్నారు. పోచమ్మ బస్తీ వాసుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆనంద కృష్ణ బస్తీని పరిశీలించారు. బస్తీలో అక్కడక్కడ పైప్‌లైన్ లీజేజీల మూలంగా తాగు నీరు రోడ్డుపై పారుతోందని విచారం వ్యక్తం చేశారు. రోడ్డుపై నుంచి నీరు గుంతల్లోకి చేరుకుని నిల్వ ఉండటంతో దోమలు పేరుకుపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. పైప్‌లైన్ లీకేజి మూలంగా కలుషిమైన నీరు ప్రజలకు సరఫరా అవుతాయని, ఫలితంగా అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయని గుర్తు చేశారు. సంమున్సిపల్ కమీషనర్ స్పందించి లీకేజిలను సరిచేసి స్వచ్ఛమైన నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆనంద కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

## మునుగోడులో ఎమ్మెల్యే ప్రచారం



మునుగోడు ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, అక్టోబరు 25, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. టిఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తే నియోజకవర్గానికి ఒనగూరే లాభాలపై ఎమ్మెల్యే ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు వినతి చేస్తున్నారు. చౌటుప్పల్‌లోని 1, 13 వార్డులలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నమూనా బ్యాలెట్ పత్రాలతో ఇంటింటికి తిరుగుతూ కారుగుర్తుకు ఓటేయాలని వినతి చేస్తున్నారు. కార్యక్రమంలో భారతి నగర్ కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు కొలన్ బాల్‌రెడ్డి, జిన్నారం ఎంపిటిసి సభ్యులు వెంకటేశ్ గౌడ్, మాజీ ఆత్మకమిటి చైర్మన్ కుమార్, బొల్లారం కౌన్సిలర్ బీరప్ప యాదవ్, టిఆర్ఎస్ నాయకులు వాంగురు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన విద్యార్థినికి సన్మానం



ప్రతిభ చాటిన విద్యార్థినీ సన్మానిస్తున్న గ్రామస్థులు

**న్యాల్‌కల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మండలంలోని అత్నూర్ గ్రామానికి చెందిన శివాజీగౌడ్ తనయ పల్లవి బిఎస్‌సి అగ్రికల్చర్ ఎంట్రెన్స్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మూడోర్యాంక్ సాధించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పల్లవిని సోమవారం పంచాయతీ కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి శివాజీపాటిల్, మాజీ సర్పంచులు సంగ్రాం పాటిల్(రాజు పాటిల్), విజయ్‌కుమార్ పాటిల్, ఎంపిపి ఉపాధ్యక్షులు గౌసోద్దిన్, గ్రామ ఉప సర్పంచ్ నీలయ్య గౌడ్, మాజీ విద్యాకమిటి చైర్మన్ మిస్లోద్దిన్, ఆయా పార్టీల నాయకులు ఇస్మాయిల్ పటేల్, నాసీర్ నిసారోద్దిన్, జమీల్ పటేల్, సంజురావు పాటిల్, నందు గౌడ్, కరామతలీ, మౌలా పటేల్, చాంద్‌పాషా, దిలీప్ కుమార్ పాటిల్, యాదయ్య మున్నూర్, రమేష్ పాటిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ

**జిన్నారం, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ప్రపంచాన్ని గడగడలాడించిన మహామ్మారి కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సేవలు అందించిన ఆశ వర్కర్లు, అంగన్‌వాడి టీచర్లకు తెలంగాణ ప్రజలు కలకాలం రుణపడి ఉంటారని టిఆర్ఎస్ నాయకులు ఎస్ఎంఆర్ యువ సేన వ్యవస్థాపకులునీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో చీరల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. గడ్డిపోతారం గ్రామ పంచాయితీ పరిధిలో జిన్నారం మండల ఎస్ఎంఆర్ యువసేల సభ్యులు గడ్డపోతారం శ్రీనివాస్, గ్రామ యువసే బాధ్యుల ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురష్కరించుకుని మహిళలకు దీపావళి కానుకగా మహిళలకు చీరలను అందించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిన్నారం మండల ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు నారబోయిన శ్రీనివాస్, రాములు, బాబు, ప్రదీప్ బిక్షపతి, శ్రీకాంత్, నరేశ్, మధు, ఎం బాబు, సాయి, బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

### ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**సంగారెడ్డి, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** ధాన్యం చివరి గింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తెచ్చి అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ధాన్యాం డబ్బులు జమచేయడం జరుగుతందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనయుడు రమేష్ చౌహన్, కల్హేర్ జడ్పీటీసీ సభ్యులు నర్సింహారెడ్డి, రవిందర్‌నాయక్, గ్రామ సర్పంచ్ ఎంబరి విఠల్, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, నారాయణఖేడ్ ఏడీఏ కరుణకర్‌రెడ్డి, ఏకేపీ ఎపిఎం టిక్యా, ఆయా శాఖల అధికారులు, తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ

**సంగారెడ్డి, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణ ఖేడ్ మండలంలోని జూకల్ శివారులో గల డబుల్ బేడ్‌రూంల వద్దగల కన్వెన్షన్‌హాల్‌లో 382 మందికి రూ.మూడు కోట్ల ఎనభై రెండు లక్షల చెక్కులను కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ దేశంలో లేని పథకాలు రాష్ట్రంలో ప్రవేశపెట్టి రైతులను ఆదుకుంటున్నారన్నారు. ఆడ పిల్లల పెళ్లిళ్ల తల్లిదండ్రులకు ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని చెప్పారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బిటిరోడ్లు, సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో తహసాల్దార్ దశరథ్ సింగ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఖేడ్ ఏడీఏ కరుణాకర్‌రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పత్తిపంటను పరిశీలిస్తున్న రాజయ్య

## పత్తికి మద్దతు ధర ప్రకటించాలి

**సంగారెడ్డి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామంలో ఆదివారం తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే రాజయ్య పరిశీలించన అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తిపంటకు వెంటనే మద్దతుధర ప్రకటించాలి, ఆకాల వర్షాల వలన నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి. గత కాలం కంటే ఈసారి ఎక్కువ వర్షపాతం పడటంవలన పత్తిపంట చాలా నష్టపోయింది. ప్రభుత్వమే పత్తిపంట వేయాలి అని చెప్పినప్పటికి చాలామంది రైతులు పత్తివైపే మొగ్గుచూపారు. కొన్ని చోట్ల పెట్టుబడి పెట్టిన తర్వాత వర్షాలు పడి రైతాంగానికి దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో పత్తి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకొని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ ద్వారా క్వింటాలుకు 15 వేల రూపాయలు తగ్గకుండా కొనుగోలు చేయాలని రైతుల తరపున ప్రభుత్వాని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మికసంఘం మండల నాయకులు గోపాల్, శ్రీనివాస్, మణయ్య, చంద్రయ్య, నరసింహులు, రామయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ

**మునిపల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఇంటిముందు దీపాళను వేలిగించి దీపావళి పండుగ జరుపుకుంటామని మునిపల్లి మండల అధ్యక్షురాలు శైలజశివశంకర్ అన్నారు. మండలంలోని ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ దుష్టశక్తులమీదా దైవశక్తి విజయం సాధించినందుకు గుర్తుగా దీపాలను వెలిగించి చిన్న, పెద్దలందరూ బనసంచాలు, టపాకులు కాలుస్తూ ఆనందంగా ఈ పండుగ జరుపుకుంటారని అన్నారు. మండల తెరసా ప్రధాన కార్యదర్శి శశికుమార్ దీపావళి పండుగ సందర్భంగా నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ఆనందంలో బనసంచా, టపాకుల రూపంలో చెడుకూడా పొంచివుందని, కావున టపాసులు కాల్చేసమయంలో అవిపేలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని వారు అన్నారు. మండలంలోని ప్రజలందరూ కోటి దీపాల కాంతుల లాగా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

## మండలంలో ఆలయాల మూసివేత

**న్యాల్‌కల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సూర్యగ్రహణాన్ని పురష్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలను మూసివేశారు. మండలంలోని రేజింతల్, హద్నూర్, చీకూర్తి గ్రామాల్లో స్వయంభూవుగా కొలువుదీరిన శ్రీ సిద్దివినాయక, శ్రీ వరసిద్ధి వినాయక ఆలయాలు, రాఘవాపూర్ గ్రామ శివారులోని పంచవటి క్షేత్రంలోని శ్రీ సరస్వతి, సూర్య భగవానుడు, సాయిబాబ, శ్రీ వెంకటేశ్వర, ద్వాదశి జ్యోతిర్లింగ, హనుమాన్ ఆలయాలను మూసివేశారు. బుధవారం తెల్లవారు జామున ఆయా ఆలయాల్లో సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దైవ దర్శనానికి అనుమతిస్తామని ఆయా ఆలయాల కమిటి బాధ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోనిఇ శ్రీ రామలింగేశ్వర ఆలయంలో సూర్య గ్రహణం సందర్భంగా ఆలయ ఆవరణలో గ్రామ భక్తులు భజనలు, కీర్తనలు ఆలపించారు.

## పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**జహీరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురష్కరించుకుని జిల్లా ఎస్పీ యం రమణకుమార్ ఆదేశాల మేరకు జహీరాబాద్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పోలీసులు, యువకులు రక్తాన్ని అందించారు. శిబిరంలో 73 మంది రక్తాన్ని అందించారు. కార్యక్రమంలో డిఎస్‌పి రఘు, జహీరాబాద్ పట్టణ, రూరల్ సిఐలు తోట భూపతి, భరత్‌కుమార్, ఎస్ఐలు కే శ్రీకాంత్, పరమేశ్వర్, కాశీనాథ్, సురేష్, వినయ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ఏడుకొండలు, ఆయా పోలీసు ఠాణాల సిబ్బంది, యువకులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తాన్ని అందచేశారు.

## దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే

**జహీరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో సోమవారం దీపావళి పర్వదినాన్ని ఘనంగా, భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. చిన్నా పెద్ద, ఆడ మగ, కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు టపాసులు కాలుస్తూ పండగను జరుపుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వ్యాపార సముదాయాల్లో సాయంత్రం బ్రాహ్మణులు, జంగములు మంత్రాలు వల్లిస్తుండగా వ్యాపార నిర్వాహకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీ పూజలు జరుపుకున్నారు. జహీరాబాద్ పట్టణంలో వ్యాపార సముదాయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సంఘమిత్ర యువజన సంఘం నూతన కార్యవర్గం

**కొల్చారం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సంఘమిత్ర యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం సంఘం భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తమ్మలి నవీన్, ఉపాధ్యక్షులుగా ర్యాగళ్ల శ్రీకాంత్, కార్యదర్శిగా దొంకెన రమేష్, సహ కార్యదర్శిగా బిట్ల అశోక్, కోశాధికారులుగా ఆకుల సాయికృష్ణ, బొజ్జ సంపత్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా చక్రధర గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా పాల్వంచ రాజేందర్ గౌడ్, తమ్మలి సంతోస్, ముత్యం రఘు, తిమ్మన్నగారి అరుణ్, చౌరిగారి సాయికుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు తమ్మలి నవీన్ మాట్లాడుతూ తనను నూతన అధ్యక్షులుగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంఘం బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

## ఆర్కిటెక్చర్‌లో అత్యుత్తమ అవకాశాలపై వెబ్‌నార్

**పటాన్‌చెరువు, అక్టోబరు 25, ప్రభాతవార్త :** గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌వోఏ) హైద్రాబాద్, విశాఖపట్టణంలు సంయుక్తంగా నవంబరు 5వ తారీఖున ఆర్కిటెక్చర్‌లో విజయవంతంమైన కేరీర్ అనే అంశంపై వెబినార్‌ను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ ఒక ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. నవంబరు 5న మధ్యాహ్నం 11 గంటల నుంచి 12.30 గంటల మధ్యలో సెబినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన ప్రకటించారు. ప్రపంచ ప్రసిద్ధ ఆర్కిటెక్చర్ సంస్థ షాటోట్టోలో ప్రిన్సిపాల్ ఆర్కిటెక్ట్‌గా, ఢాకాలో బీఆర్‌ఏసీ విశ్వవిద్యాలయంల విజిటింగ్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ ఎండీ రఫీక్ ఆజాం వెబినార్‌లో ముఖ్య వక్తగా వ్యవహరిస్తారన్నారు. ఆసక్తి గల వారు 5888583609ను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం అసోసియేట్ ప్రొఫెసర్ కనక ఎస్ రావు (9866619639)ను సంప్రదించాలని డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

## మునుగోడులో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రచారం



మునుగోడు నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, హరికృష్ణ

**శివ్వంపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నికల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు అక్కడే మకాం వేసి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మదన్‌రెడ్డితో పాటు మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై. రాజా రమణాగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, పైడి శ్రీధర్‌గుప్త, షేక్ అలీ, సూర్యం చౌహాన్ తదితరులు కలిసి అధికార పార్టీ అభ్యర్థి కూసుకుంట ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా అన్ని గ్రామాల్లో తిరుగుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని కోరుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు డిపాజిట్ కూడా దక్కదని వారు జోష్యం చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభాకర్‌రెడ్డిని తప్పకుండా గెలిపిస్తామని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు.

## జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధమవ్వాలి

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** 2022-23 విద్యా సంవత్సరానికి గాను జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఆర్‌టీ) ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవంబర్ మూడో వారంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎ. రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి సిహెచ్. రాజిరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, ప్రసార సాంకేతికతలో పురోగతి, పర్యావరణ అనుకూలపదార్థాలు, ఆరోగ్యం-పరిశుభ్రత, రవాణా-ఆవిష్కరణ, మానవ తప్పిదాలవల్ల పర్యావరణంపై కలిగే అనర్థాలు-నివారణ (పర్యావరణ ఆందోళనలు), ప్రస్తుత ఆవిష్కరణతో చారిత్రక అభివృద్ధి, మనకోసం గణితం అంశాలకు అనుగుణంగా విద్యార్థులు ఎగ్జిబిట్స్ తయారు చేసేలా ఆయా పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సమస్యలకు పరిష్కారం చూపే నాణ్యమైన ప్రాజెక్టులు తయారు చేసేలా చూడాల్నారు.

## ఐఎంఎల్ డిపో ఎదుట ఉపాధి కోసం నిరసన

**కొల్చారం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** కొల్చారం మండలం ఐఎంఎల్ డిపో ముందు నిరుద్యోగుల నిరసన ఉగ్రరూపం దాల్చింది. స్థానిక నిరుద్యోగ యువతకు ఐఎంఎల్ డిపోలో ఉపాధి దొరికే వరకు వారి పక్షాన ఉద్యమం కొనసాగిస్తామని ఉద్యమ జేఏసీ కమిటీ అధ్యక్షులు పుల్లబోయిన మల్లేష్, ఉపాధ్యక్షులు సోమ నర్సింలు, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణగౌడ్, మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. కొల్చారం మండలం చిన్నఘనపూర్ ఐఎంఎల్ డిపో ముందు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన మంగళవారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐఎంఎల్ డిపో ముందు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరుద్యోగ యువత నిరసన తెలిపారు. అనంతరం జేఏసీ నేతలు పుల్లబోయిన మల్లేశం, సోమ నర్సింలు, లక్ష్మీనారాయణగౌడ్, మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ ఐఎంఎల్ డిపోలో నిరుద్యో యువతకు ఉపాధి అవకాశం దొరకకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతం చేస్తామని అన్నారు. ఐఎంఎల్ డిపోలో 300 మంది చేసే పనిని కేవలం 60 మంది హమాలీలు చేస్తూ పని లబ్ధి పొందుతున్నారని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. డిపో డీఎం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉందని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. స్థానిక యువతకు ఉపాధి దొరకక వలస పోతున్నారని అన్నారు. ఉన్నత చదువులు చదివి కూడా కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో యువత ఉన్నారని అన్నారు. దశల వారిగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని జేఏసీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, నిరుద్యోగ యువకులు ఉన్నారు.



ఐఎంఎల్ డిపో ముందు నిరసన తెలుపుతున్న నిరుద్యోగ యువకులు



శ్రీకేతకి సంగమేశ్వర ఆలయం మూసివేసిన దృశ్యం

## సూర్యగ్రహణంతో కేతకి ఆలయం మూసివేత

**ఝరాసంగం, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సూర్య గ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీకేతకి సంగమేశ్వర స్వామి ఆలయం మూసివేసినట్లు ఇఒ శశిధర్, అర్చకులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు ఆలయాన్ని మూసి ఉంచడం జరుగుతుందన్నారు. బుధవారం ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం భక్తులకు దైవ దర్శనానికి అనుమతించడం జరుగుతుందని వారు వివరించారు.

## రేపటి నుంచి గుండంలో పుణ్యస్నానాలు

-రెండేళ్లుగా మూసిఉన్న పవిత్ర గుండం



శ్రీ కేతకి ఆలయంలో పవిత్ర గుండం దృశ్యం

**ఝరాసంగం, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మహమ్మారి కరోనా కారణంగా ఝరాసంగంలోని శ్రీకేతకి సంగమేశ్వర ఆలయంలోని పవిత్ర గుండంను అధికారులు మూసివేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు పవిత్ర గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి దర్శించుకుంటూ ఉంటారు. అయితే కరోనాతో రెండేళ్ల క్రితం మూసివేసిన గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేలా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 27వ తారీఖున గండం పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులు గండంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతిస్తామని ఆలయ ఇఒ శశిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఒ శశిధర్ సూచించారు.

## ఛట్ పూజలకు సాకి చెరువుపై ఏర్పాట్లు

-పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఉత్తర భారతీయులు పవిత్రంగా జరుపుకునే ఛట్ పూజా కార్యక్రమాలను పురష్కరించుకుని పట్టణ శివారులోని సాకి చెరువుపై ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. సాకి చెరువుపై కొనసాగుతున్న ఏర్పాట్లను మంగళవారం పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఛట్ పూజలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తారని, అందుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటి చైర్మన్ విజయ్‌కుమార్, బల్దియా డిప్యూటీ కమీషనర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దీపావళి పండుగ

**సంగారెడ్డి, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** దీపావళి పండుగను నారాయణఖేడ్ పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నలు పెద్దలు ఉదయం నుంచే నూతన వస్త్రాలు ధరించి పండుగను ఘనంగా జరుపుకున్నారు. దీపావళి పండుగ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల్లో నిర్వహించిన లక్ష్మి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా దుకాణాల యజమానులు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డికి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుబినా నజీబ్, ఎ.ఎంసి వైస్ చైర్మన్ విజయ్ బుజ్జీ, పట్టణ తెరాస అధ్యక్షులు నగేష్, తెరాస నాయకులు తదితరులు ఉన్నారు.

## కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**జిన్నారం, అక్టోబరు 25, ప్రభాతవార్త:** పారిశ్రామిక వాడలోని మెట్రోకెం పరిశ్రమలో శ్రీకాకుంళంకు చెందిన మురళియాదవ్ (41) పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే మురళియాదవ్ పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా అనారోగ్యంతో తిరిగిరాని లోకాలకు చేరిపోయాడు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆదివారం కర్మాగార యాజమాన్యంతో చర్చించి బాధిత కుటుంబానికి రూ. 9 లక్షలు అందించేలా ఒప్పించారు. మృతుడి అంత్యక్రియలకు చంద్రారెడ్డి కటుంబసభ్యులకు 10వేలు అందించి పరామర్శించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన కౌన్సిలర్ చంద్రారెడ్డి, జిల్లా కార్మిక నాయకులు వి వంప్రసాద్‌లకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ, సాయి, పరిశ్రమ యాజమాన్యం పాల్గొన్నారు.

## మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయం

**జిన్నారం, అక్టోబరు 25, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో స్వర్గీయ మల్లారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కౌన్సిలర్, టిఆర్ఎస్ నాయకులు వి చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లో మల్లారెడ్డి 20వ వర్ధంతిని పురష్కరించుకుని మల్లారెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. మల్లారెడ్డి చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, వి మాధవ్‌రెడ్డి, వి యాదిరెడ్డి, వి రాజేందర్‌రెడ్డి, కార్మిక నాయకులు వి వరప్రసాద్‌రెడ్డి, లోకేశ్‌రెడ్డి, వి విష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రయన, చిక్రపాణి, పాస్టర్ శంకర్, మల్లారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మల్లారెడ్డికి నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

## జూదగృహాలపై దాడి : 14 మందిపై కేసు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మండలంలోని ఔదత్‌పూర్, కారముంగి గ్రామాల్లో పేకాట ఆడుతున్న 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌రావు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి జూద గృహాలపై దాడులు నిర్వహించామన్నారు. ఆయా గ్రామాల్లో జూదం ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు13వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట స్థావరాలపై నిర్వహించిన దాడిలో పోలీసు సిబ్బంది అబ్రహం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పోలీసుల అదుపులో 50 మంది పేకాటరాయుళ్లు...

**న్యాల్‌కల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** హద్నూర్ పోలీసులు జూదం ఆడుతున్న 50 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసిన సంఘటన ఇది. ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం...మండలంలోని రాఘవాపూర్, చాల్కి, అమీరాబాద్, వడ్డీ, రాంతీర్థం, హద్నూర్ గ్రామాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ వినయ్‌కుమార్ సిబ్బందితో జూదగృహాలపై మంగళవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించి ఆదుపులోకి తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో జూదం ఆడుతున్న 50 మందిని అదుపులోకి తీసుకుని 68,610 రూపాయలను సీజ్ చేసి, 7 కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. మంగళవారం హద్నూర్ లోని పోలీసు ఠాణాలో జూదగ్రస్తులకు ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. జూదం ఆడితే కలిగే కష్టనష్టాలపై అవగాహన కల్పించారు.